వైద్యవైడూర్యం

ఒకప్పుడు అరకొర వసతులు, కాలం చెల్లిన పరికరాలు, చాలీచాలని మంచాలతో కునారిల్లిన సత్తెనపల్లి ఏరియా వైద్యశాల రూపురేఖలు ఇప్పుడు మారిపోయాయి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక అన్ని సౌకర్యాలూ సమకూరాయి. సిబ్బంది కొరత తీరింది. రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు ప్రత్యేక కృషితో రోగులకు మెరుగైన సేవలు అందుతున్నాయి. ఫలితంగా ఆస్పత్రి రాష్ట్రస్థాయిలో గుర్తింపు పొందింది.

- సత్తెనపల్లి ఏరియా వైద్యశాల
- సేవల్లో అత్యుత్తమం
- ఏపీవీవీపీ ర్యాంకింగ్‌లో రాష్ట్రస్థాయి 4వ స్థానం
- జిల్లా స్థాయిలో 2వ స్థానంతో ఘనత


రూ.79 లక్షలతో ఏర్పాటు చేసిన ఆక్సిజన్ ప్లాంట్



సత్తెనపల్లి ఏరియా వైద్యశాల

సత్తెనపల్లి: ఏరియా వైద్యశాలకు సత్తెనపల్లి, పెదకూరపాడు నియోజకవర్గాల నుంచి నిత్యం వందలాది మంది రోగులు వస్తుంటారు. గిరిజన తండాల నుంచి పెద్ద ఎత్తున తరలివస్తారు. గత టీడీపీ ప్రభుత్వం ఈ ఆస్పత్రి అభివృద్ధిని పట్టించుకోలేదు. దీంతో రోగులు తీవ్రంగా ఇబ్బందులు పడేవారు. మెరుగైన వైద్యం కోసం ఎక్కువగా గుంటూరు, నరసరావుపేటలకు వెళ్లేవారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో ఏరియా ఆస్పత్రి అభివృద్ధిపై రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు దృష్టి సారించారు. వసతులు కల్పించారు. వైద్యులు, సిబ్బంది కొరత తీర్చారు. రేడియాలజిస్ట్ మినహా ప్రస్తుతం 21మంది వైద్యులు ఉన్నారు. 102మంది సిబ్బంది మూడు షిఫ్టులుగా 24 గంటలూ సేవలందిస్తున్నారు. దీంతో ఆస్పత్రిపై ప్రజల్లోనూ నమ్మకం పెరిగింది. గతంలో కేవలం 300 నుంచి 350గా ఉన్న ఔట్ పేషెంట్ల(ఓపీ) సంఖ్య ప్రస్తుతం 800 నుంచి 900 వరకు ఉంటుంది. 100 పడకలు అందుబాటులో ఉన్నాయి. ప్రతినెలా 100 నుంచి 120 వరకు ప్రసవాలు జరుగుతున్నాయి.


వైద్య సేవలు పొందుతున్న మహిళలు

'ఏ'గ్రేడ్ సేవలు

రోగులకు అందుతున్న సేవల ఆధారంగా ఆంధ్రప్రదేశ్ వైద్య విధాన పరిషత్ చేపట్టిన పరిశీలనలో ఈ ఆస్పత్రి 24 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో నాలుగో ర్యాంక్ దక్కించుకుంది. జిల్లా స్థాయిలో రెండో ర్యాంక్‌తో 'ఏ' గ్రేడ్ సాధించింది. ఆస్పత్రిలో ప్రస్తుతం ఆర్థో, పీడియాట్రిక్, ఆప్తమాలజీ, గైనకాలజీ, డెంటల్, డెర్మటాలజీ, ఈఎన్‌టీ, జనరల్ మెడిసిన్ సేవలందుతున్నాయి. ఏరియా వైద్యశాల అభివృద్ధి కమిటీ సభ్యుడు కొత్త రామకృష్ణ నేతృత్వంలో దాతల నుంచి రూ.70 లక్షల వరకు సేకరించి ఫిజియోథెరపీ విభాగానికి పరికరాలు సమకూర్చారు. ఈసీజీ, వెంటిలేటర్లూ అందుబాటులో ఉన్నాయి.

రూ.8.54 కోట్లతో అభివృద్ధి పనులు

వైద్యశాలలో రూ.8.54 కోట్లతో వివిధ పనులు జరుగుతున్నాయి. రూ.7 కోట్ల నాబార్డు నిధులతో భవన నిర్మాణ పనులు చేపట్టారు. రూ.79 లక్షలతో ఆక్సిజన్ ప్లాంట్ ఏర్పాటైంది. ఐటీసీ సహకారంతో రూ.33 లక్షలతో మరో ప్లాంటు సమకూరింది. రూ.42 లక్షలతో జనరేటర్, ట్రాన్స్‌ఫార్మర్ అందుబాటులోకి వచ్చాయి.


నవజాత శిశు సంరక్షణ వార్డు

ఉత్తమ పనితీరుకు గుర్తింపు



మంత్రి అంబటి రాంబాబు కృషికి, అభివృద్ధి కమిటీ, ఆస్పత్రి సిబ్బంది పనితీరుకు మంచి గుర్తింపు లభించింది. వైద్య ప్రమాణాలు పెరిగాయి. ఇది శుభపరిణామం.

– కొత్తా రామకృష్ణ, అభివృద్ధి కమిటీ సభ్యుడు, సత్తెనపల్లి

గుర్తింపు బాధ్యత పెంచింది



ప్రైవేట్ ఆస్పత్రులకు దీటుగా సేవలు అందిస్తున్నాం. మంత్రి అంబటి రాంబాబు, ప్రభుత్వ సహకారం భేష్. దీనికితోడు వైద్యులు, సిబ్బంది సమష్టి కృషి వల్ల రాష్ట్రస్థాయి గుర్తింపు సాధ్యమైంది. ఇది బాధ్యతను మరింత పెంచింది.

– డాక్టర్ ఈటిపోగు వెంకట్రావు, సూపరింటెండెంట్, సత్తెనపల్లి

స్పందన అర్జీలకు సత్వర పరిష్కారం చూపాలి

జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్


పాకాలపాడు సచివాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న జేసీ శ్యాం ప్రసాద్

సత్తెనపల్లి: స్పందనకు వచ్చే అర్జీలకు తక్షణమే పరిష్కారం చూపాలని పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ చెప్పారు. సత్తెనపల్లి మండలం పాకాల పాడు గ్రామంలోని సచివాలయాన్ని శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. సచివాలయంలో స్పందన అర్జీలు పెండింగ్ లేకపోవడంపై అభినందించారు. అనంతరం భీమవరం–గండ్లూరులో పట్టణ పేదల కోసం ఏర్పాటు చేసిన జగనన్న లేఅవుట్లను పరిశీలించారు. గృహనిర్మాణాలపై అధికారులతో సమీక్షించారు. ఉగాది నాటికి పక్కా గృహ నిర్మాణాలను పూర్తి చేయాలని ఆదేశించారు. లేఅవుట్ల మెరకకు చర్యలు చేపడతామని చెప్పారు. సమగ్ర భూసర్వేపైనా ఆరా తీశారు. ఆయన వెంట సత్తెనపల్లి ఆర్డీఓ బీఎల్ఎన్ రాజకుమారి, తహసీల్దార్ కె.నగేష్, ఎంపీడీఓ జీవీ సత్యనారాయణ, మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి, గృహ నిర్మాణ శాఖ ఏఈ సుబ్బారావు పాల్గొన్నారు.

నేడు అచ్చంపేటలో గడప గడపకు మన ప్రభుత్వం

పెదకూరపాడు: అచ్చంపేటలోని సచివాలయం –1లో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం 4 గంటల నుంచి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ప్రారంభించనున్నట్లు ఎమ్మెల్యే శంకరరావు వ్యక్తిగత కార్యదర్శి దర్శి వెంకటేశ్వరరావు శుక్రవారం తెలిపారు.

క్లుప్తంగా

రీసర్వేతో శాశ్వత పరిష్కారం

జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్



పెదకూరపాడు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రీ–సర్వేతో రైతులకు ఎంతో మేలు జరుగుతుందని జాయింట్ కలెక్టర్ శ్యాం ప్రసాద్ చెప్పారు. మండలంలోని చిన్నమక్కెన గ్రామంలో భూ రీసర్వేను ఆయన పరిశీలించారు. అనంతరం రైతులకు అవగాహన కల్పించారు. సర్వే వేగవంతం చేయాలని సిబ్బందికి సూచించారు. సర్వేతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో సర్వే టీంలు, అధికారులతో సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్డీఓ రాజకుమారి, తహసీల్దార్ క్షమారాణి, సర్వేయర్ మాధవి పాల్గొన్నారు.

నేడు గృహసారథులకు శిక్షణ

బెల్లంకొండ: మండలంలోని వివిధ గ్రామాల్లో వలంటీర్ల క్లస్టర్ పరిధిలో ఎంపిక చేసిన గృహ సారథులకు శనివారం శిక్షణ తరగతులను నిర్వహించనున్నట్లు మండల సచివాలయ కన్వీనర్ గాదె మిల్లు వెంకటరెడ్డి తెలిపారు. మండలంలోని చంద్రాజుపాలెం గ్రామంలోని ఎస్ఎస్ కన్వెన్షన్‌లో ఉదయం 10 గంటలకు ఈ కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు. పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు హాజరవుతారని వివరించారు.

నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

బెల్లంకొండ: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వెంకటరెడ్డి తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు సమావేశ మందిరంలో ఎంపీపీ చెన్నపురెడ్డి పద్మా వెంకటేశ్వరరెడ్డి అధ్యక్షతన జరుగుతుందని పేర్కొన్నారు.

ఓటరు గుర్తింపు కార్డుకు ఆధార్ అనుసంధానం చేయాలి

నకరికల్లు: ఓటరు గుర్తింపు కార్డుకు ఆధార్ అనుసంధానం త్వరగా పూర్తిచేయాలని తహసీల్దార్ ఎస్.సురేష్ వీఆర్వోలకు సూచించారు. తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.

రామనామ సంకీర్తన

గోళ్ళపాడు(ముప్పాళ్ళ): గోళ్ళపాడు గ్రామంలోని శ్రీప్రసన్నాంజనేయస్వామి వార్షిక మహోత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అఖండ హరేరామ నామ సంకీర్తన చేపట్టారు. ఈనెల 26న స్వామి తిరునాళ్ళ నిర్వహించనున్నారు.

వలంటీర్ ఖాళీలకు దరఖాస్తుల ఆహ్వానం

సత్తెనపల్లి: పట్టణంలో ఖాళీగా ఉన్న ఐదు వలంటీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి శుక్రవారం తెలిపారు. పట్టణంలోని క్రిస్టియన్ పేటలో రెండు, రంగా కాలనీలో ఒకటి, వడ్డవల్లి ఏరియాలో రెండు వలంటీర్ స్థానాలు ఖాళీగా ఉన్నాయని పేర్కొన్నారు. ఔత్సాహికులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు.

పెండెం బాబూరావుకు సత్కారం



సత్తెనపల్లి: సత్తెనపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియమితులైన పెండెం బాబూరావును మాల మహానాడు ఆధ్వర్యంలో శుక్రవారం సత్కరించారు. కార్యక్రమంలో మాల మహానాడు నియోజకవర్గ అధ్యక్షుడు గుంటూరు ఆశీర్వాదం, నాయకులు కూచిపూడి జాన్, మాలే కిరణ్, మాలే మరియదాసు, మనికే మహేష్, బిల్లా మేరీ తదితరులు పాల్గొన్నారు.

అమరేశ్వరుని సేవలో మంత్రి ఉషాశ్రీచరణ్


మంత్రి ఉషాశ్రీచరణ్‌కు స్వాగతం పలుకుతున్న అర్చకులు

అమరావతి: అమరావతిలోని బాలచాముండికా సమేత అమరేశ్వర స్వామిని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషాశ్రీచరణ్ శుక్రవారం సందర్శించారు. మంత్రి ఉషాశ్రీచరణ్‌కు ఆలయ అధికారులు, అర్చకులు, వేదపండితులు స్వాగతం పలికారు. అమరేశ్వరస్వామికి, బాలచాముండేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ అర్చకులు మంత్రి ఉషాశ్రీచరణ్‌కు స్వామి శేష వస్త్రాన్ని, తీర్థప్రసాదాలను అందజేశారు. ఆమె వెంట తాడికొండ ఐసీడీఎస్ ప్రాజెక్టు ఇన్‌చార్జ్ సీడీపీఓ సింహచలం పాల్గొన్నారు.

రైల్వే అడిషనల్ జీఎం ఉదయకుమార్‌రెడ్డి సందర్శన

అమరావతిని శుక్రవారం దక్షిణ మధ్య రైల్వే అడిషనల్ జనరల్ మేనేజర్ ఉదయకుమార్‌రెడ్డి దంపతులు సందర్శించారు. తొలుత అమరేశ్వరాలయాన్ని దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మ్యూజియంను, ధ్యానబుద్ధ ప్రాజెక్టును సందర్శించారు. ఆయన వెంట గుంటూరు ఏఆర్ఎం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

28న ఏఎంసీ ప్రమాణస్వీకారోత్సవం


సమావేశంలో మాట్లాడుతున్న ఈదా సాంబిరెడ్డి

క్రోసూరు: క్రోసూరు మార్కెట్‌యార్డు కొత్త పాలక మండలి ప్రమాణస్వీకారమహోత్సవం ఈనెల 28వ తేదీన జరుగుతుందని మార్కెట్ యార్డు చైర్మన్‌గా నియమితులైన ఈదాసాంబిరెడ్డి శుక్రవారం తెలిపారు. ఈమేరకు మార్కెట్‌యార్డులో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. యార్డు సెక్రటరీ శంకరరెడ్డి అధ్యక్షత వహించారు. సాంబిరెడ్డి మాట్లాడుతూ ఈనెల 28న సాయంత్రం 5 గంటలకు జరిగే ప్రమాణస్వీకార మహోత్సవానికి యార్డు గౌరవ అధ్యక్షులు, ఎమ్మెల్యే నంబూరుశంకరరావు, ముఖ్యఅతిథులుగా రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో గ్రామసర్పంచ్ మల్లా చందమామ, యార్డు వైస్ చైర్మన్ గార్లపాటి దాసు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ వెలది అప్పారావు, క్రోసూరు జెడ్పీటీసీ షేక్ జమీలా గఫూర్, గార్లపాటిదాసు, పొశంశ్రీనివాసరెడ్డి, అడితి ముస్తఫా, తిప్పిరెడ్డి అప్పిరెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షుడు అనుముల కోటిరెడ్డి, యార్డు మాజీ చైర్మన్ డాక్టర్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

చేయూత, ఆసరా ద్వారా జీవనోపాధి


వీఓఏలతో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ బాలూనాయక్, అధికారులు

నకరికల్లు: మహిళల ఆర్థికాభివృద్ధికి వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ ఆసరా పథకాలు తోడ్పడతాయని డీఆర్‌డీఏ పీడీ బి.బాలూనాయక్ చెప్పారు. మండల సమాఖ్య పరిధిలోని వీఓఏలతో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. రికార్డులు తనిఖీ చేశారు. స్వయం సహాయక సంఘాల మహిళలు తయారు చేసిన ఉత్పత్తులను ఫ్లిప్‌కార్ట్ ద్వారా విక్రయించేందుకు ప్రభుత్వ సహకారంతో అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. స్త్రీనిధి రుణాలు సద్వినియోగం చేసుకొని మహిళలు ఆర్థికంగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో శ్రీనిధి ఏపీఎం చెన్నకేశవులు, ఏపీఎం సునీత పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా ప్లాన్లు ఇప్పిస్తే చర్యలు


వినతిపత్రం అందజేస్తున్న టెక్నికల్ లైసెన్స్ పర్సన్ అసోసియేషన్ ప్రతినిధులు

నరసరావుపేట: మున్సిపల్ నిబంధనలకు విరుద్ధంగా లైసెన్స్‌డ్ టెక్నికల్ పర్సన్లు ప్లానుల అనుమతులు ఇప్పిస్తుంటే వారిని సంఘం నుంచి తప్పిస్తామని నరసరావుపేట లైసెన్స్‌డు ఇంజినీర్స్ అండ్ సర్వేయర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కొమ్మసాని కమలాకరరెడ్డి అధికారులకు హామీ ఇచ్చారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్‌హాలులో నిర్వహించిన టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరంలో లైసెన్స్‌డ్ ఇంజినీర్లు ప్లాన్లు ఇప్పించటంలో తామెదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. సమావేశంలో టీపీఓ నరసింహారావు, టీపీఎస్‌లు అనూరాధ, రఘురాం, టౌన్ సర్వేయర్ వై.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణించడం అభినందనీయం



చిలకలూరిపేట: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించటం అభినందనీయమని మురికిపూడి జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం జీఎస్ కరిముల్లా చెప్పారు. రోటరీ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట ఆధ్వర్యంలో పట్టణంలోని చౌదరయ్య స్కూల్‌లో ఇటీవల నియోజకవర్గ స్థాయి ఖోఖో పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో మురికిపూడి జెడ్పీ హైస్కూల్ బాలికల జట్టు ద్వితీయ బహుమతి సాధించింది. బహుమతి సాధించిన జట్టుకు పాఠశాల ప్రాంగణంలో శుక్రవారం అభినందన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో స్కూల్ పీడీ ఎస్‌కే అచ్చేమియా, ఉపాధ్యాయులు శ్రీనివాసరెడ్డి, రసూల్, కవిత, మాధవి పాల్గొన్నారు.

వలంటీర్ ఖాళీలకు దరఖాస్తుల ఆహ్వానం

నకరికల్లు: గ్రామవలంటీర్ ఖాళీలను భర్తీచేసేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీఓ బండి శ్రీనివాసరెడ్డి శుక్రవారం తెలిపారు. చాగల్లు–బీసీ 1, చల్లగుండ్ల – బీసీ 1, దేచవరం– ఓసీ 1, గుండ్లపల్లి– బీసీ 1, నకరికల్లు– ఎస్టీ– 2, బీసీ–2 మొత్తం 8 వలంటీర్ పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేశామని పేర్కొన్నారు. పదోతరగతి విద్యార్హత కలిగి 2022 జనవరి 1 నాటికి 18 నుంచి 35ఏళ్ల లోపు వారు దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు. ఈనెల 24 నుంచి మార్చి 2 వరకు దరఖాస్తులు స్వీకరిస్తామని పేర్కొన్నారు. మార్చి 3, 4వ తేదీలలో దరఖాస్తులు పరిశీలించి మార్చి 5న మౌఖిక పరీక్ష ఉంటుందని వెల్లడించారు. 6న ఎంపిక వివరాలు తెలియజేసి 7న శిక్షణనిస్తామని వివరించారు. మార్చి 8 నుంచి ఎంపికైన వలంటీర్లు విధులకు హాజరు కావాలని సూచించారు.

దొంగకు దేహశుద్ధి

సత్తెనపల్లి: ఇంట్లోకి ప్రవేశించి చోరీకి యత్నించిన యువకుడిని పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం నందిగామ గ్రామంలో శుక్రవారం గ్రామస్తులు పట్టుకొని దేహశుద్ధి చేశారు. అనంతరం సత్తెనపల్లి రూరల్ పోలీసులకు అప్పగించారు. సత్తెనపల్లి పట్టణంలోని శాస్త్రీనగర్‌కు చెందిన యువకుడిగా పోలీసులు గుర్తించి విచారణ చేస్తున్నట్లు సమాచారం. నిందితుడిపై పాత కేసులు ఉన్నట్లు తెలుస్తోంది.

మాదలలో ఫ్యామిలీ ఫిజీషియన్

మాదల(ముప్పాళ్ళ): మాదల గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం గురువారం జరిగింది. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు పి.రమాదేవి, ఎస్.సూర్యప్రకాశరావు పాల్గొని 128 మందికి వైద్య సేవలందించారు. రక్త, షుగర్, బీపీ పరీక్షలు నిర్వహించి మందులను అందించారు. ఎంపీపీ పాఠశాలలోని విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ పావని, సూపర్‌వైజర్లు పీటర్ డానియేల్, జోస్పిన్‌రాణి, ఏఎన్ఎమ్‌లు అన్నామణి, రమమ్మ, డీఈఓ రవితేజ పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్‌ను బీజేపీ మోసగించింది

అమరావతి: కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు మొండిచేయి చూపడాన్ని వ్యతిరేకిస్తూ సీపీఎం నేతలు నిరసన వ్యక్తం చేశారు. శుక్రవారం స్థానిక అంబేడ్కర్ బొమ్మ సెంటర్‌లో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. సీపీఎం మండల కార్యదర్శి బి.సూరిబాబు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ విధానాలపై ధ్వజమెత్తారు. కార్యక్రమంలో నాయకులు ఎస్.కె.మొహిద్దీన్‌వలి, సుబ్రమణ్యం, కృష్ణ పాల్గొన్నారు.

పది తరగతి విద్యార్థులకు అవగాహన సదస్సు

వినుకొండ(నూజెండ్ల): పదో తరగతి విద్యార్థులు ఆందోళన, ఒత్తిడికి గురికావద్దని ప్రముఖ సైకాలజిస్ట్ ప్రత్యూష సుబ్బారావు తెలిపారు. నూజెండ్లలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మోడల్ పాఠశాల, కేజీబీవీ పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు.

కట్టుకథలిక కట్టిపెట్టాలి

- చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు
- ఈనాడు అసత్య వార్తలపై ప్రజల ఆగ్రహం
- ఆ పత్రిక ప్రతులను దహనం చేసిన నాయకులు


పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో ఈనాడు పత్రిక ప్రతులను దహనం చేస్తున్న నాయకులు

సత్తెనపల్లి: పచ్చ పత్రిక ఈనాడుపై ప్రజల నిరసన కొనసాగుతూనే ఉంది. తప్పుడు వార్తలు రాసి మోసం చేస్తున్న పత్రిక తీరుపై శుక్రవారం పల్నాడు జిల్లా సత్తెనపల్లి పట్టణంలో వైఎస్సార్ సీపీ శ్రేణులు, ప్రజా సంఘాలు, సామాజిక కార్యకర్తలు ధ్వజమెత్తారు. ఆ పత్రిక ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు మాట్లాడుతూ ఈనాడు అధినేత రామోజీరావు ఇంతగా దిగజారిపోవడం దారుణమని విమర్శించారు. తప్పుడు కథనాలను ప్రచురించి చంద్రబాబు నాయుడికి అండగా నిలవాలని ఆయన పడుతున్న తాపత్రయం సిగ్గుచేటని పేర్కొన్నారు. పాత ఫొటోలతో వార్తలు ప్రచురించి ప్రజలను తప్పుదోవ పట్టించి, ప్రభుత్వంపై బురదజల్లేందుకు ఈనాడు చేసిన కుట్ర మరోసారి బయటపడిందని దుయ్యబట్టారు. సత్తెనపల్లి గడియార స్తంభం సెంటర్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్‌లు షేక్ నాగూర్ మీరాన్, రమావత్ కోటేశ్వరరావు నాయక్, వాణిజ్య విభాగం పల్నాడు జిల్లా అధ్యక్షుడు, కౌన్సిలర్ అచ్యుత శివప్రసాద్, కౌన్సిలర్ అవ్వారు శ్రీను, పెద్దింటి వెంకటేశ్వర్లు, సహారా మౌలాలి, శిరిగిరి వెంకట్రావు, చిలుకా రమణయ్య, చుక్కా మోషే, గని, మెడికల్ మల్లి, వల్లేం నరసింహారావు, నాగుర్ బాషా, క్యాటిబర్ జానీ, రవితేజ, నందిగామ అదం, సుభాని, మహీ, హుస్సేన్, మనోహర్, శివపురం రామారావు, మండపు శివ సాయి పాల్గొన్నారు.

వైభవంగా వీరబ్రహ్మేంద్ర స్వామి కల్యాణోత్సవం


స్వామికి పూజలు చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

బెల్లంకొండ: వన్నాయపాలెం గ్రామంలో శ్రీ గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్ర స్వామి వార్షిక కల్యాణ మహోత్సవాలు శుక్రవారం వైభవంగా జరిగాయి. గ్రామంలోని ప్రధాన సెంటర్ వద్ద ఉన్న ఆలయంలో వేడుకలను గ్రామస్తులు నిర్వహించారు. ఉదయం స్వామికి సుప్రభాత సేవ, ఏకాదశ రుద్రాభిషేకాలను నిర్వహించారు. అనంతరం ఉత్సవ విగ్రహాలకు మంగళస్నానాలను చేయించారు. పీటలపై కూర్చున్న దంపతులు స్వామివార్లను కల్యాణ మండపంలోకి తీసుకు వెళ్లారు. 11 గంటలకు స్వామి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం జరిగింది. స్వామికి వైఎస్సార్ సీపీ నాయకులు చెన్నపరెడ్డి పద్మా వెంకటేశ్వరరెడ్డి, మండల నాయకులు మర్రి ప్రసాదరెడ్డి, చింతారెడ్డి సాయిరెడ్డి, భద్రయ్య, గ్రామ సర్పంచ్ మేకల త్రివేణి, సోమయ్య, మేకల వెంకటేశ్వర్లు, లక్ష్మయ్య, సైదయ్య, రమణారెడ్డి, మిల్లు వెంకటరెడ్డి, నాగిరెడ్డి పాల్గొన్నారు.

పాస్‌పుస్తకాల కోసం సచివాలయాల్లోనే దరఖాస్తు చేసుకోవాలి

అమరావతి: పట్టాదారు పాస్‌పుస్తకాల కోసం గ్రామ సచివాలయంలోనే దరఖాస్తు చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్ భూ యజమానులకు సూచించారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ భూ సర్వేపై సూచనలు సలహాలు ఇచ్చారు. పల్నాడు జిల్లాలో 47 గ్రామాల్లో సర్వే పూర్తయిందని చెప్పారు. అనంతరం భూ యజమానులకు అవగాహన కల్పించారు. అనంతరం కార్యాలయంలో పనికిరాని వస్తువులను జేసీ పరిశీలించారు. కార్యక్రమంలో సత్తెనపల్లి ఆర్డీఓ రాజకుమారి, తహసీల్దార్ విజయశ్రీ పాల్గొన్నారు.